సాక్షి
వికారాబాద్
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



ఇక్కడా కర్ణాటక ఫలితాలే..

కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతం అవుతాయని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఘనంగా విశ్వకర్మ జయంతి

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. 9లో▸



సంఘటితంతోనే..

సంఘటితంతోనే డిమాండ్లను సాధించగలమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. 9లో▸

‘ది ఫాలెన్ కింగ్‌డమ్ ఆఫ్ ఏ డిక్టేటర్ నిజాం’ ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

పరిగి: పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ భాస్కర యోగి రచించిన ది ఫాలెన్ కింగ్‌డమ్ ఆఫ్ ఏ డిక్టేటర్ నిజాం పుస్తకాన్ని ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయులు మొదలుకుని 7వ నిజాం వరకు జరిగిన చరిత్రను భావితరాలకు అర్థమయ్యేలా భాస్కరయోగి అక్షరీకరించారన్నారు. విమోచనానికి సంబంధించిన కథనాలకు ఈ పుస్తకం సమాధానం అవుతుందని వక్తలు పేర్కొన్నారు. సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

- ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం
- జాతీయ సమైక్యతా దినోత్సవంలో మంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని భూగర్భగనులు, సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ సమైక్యతాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల చెక్కులు, దివ్యాంగులకు ట్రై స్కూటీలు, ఇతర ఉపకరణాలు అందజేశారు.

పేదలకు అందుబాటులో విద్య, వైద్యం

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పేదలకు విద్య, వైద్యం మరింత చేరువయిందన్నారు. కేసీఆర్ కిట్లు కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. తాండూరు, వికారాబాద్‌లో ఉచిత డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కళాశాల, డయోగ్నోస్టిక్ సెంటర్, ఆయుష్ ఆస్పత్రి, తాండూరులో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. కేజీ టు పీజీ విద్యను అందించేందుకు 33 గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు.

సంక్షేమంలోనూ మనమే నంబర్ వన్

రైతుల అభ్యున్నతి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రవేశపెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రైతుబంధు, రైతుబీమా, రైతు రుణ మాఫీ చేశామన్నారు. మొదటి విడతలో రూ.93 కోట్ల వ్యయంతో గొర్రెలు పంపిణీ చేయగా.. రెండవ విడతలో 200 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశామన్నారు.

పల్లె, పట్టణ ప్రగతితో వసతుల కల్పన

పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా 880 వాటర్ ట్యాంకులు నిర్మించామన్నారు. స్త్రీనిధి రుణాలు, ఆసరా, వృద్ధాప్య పింఛన్లు అందజేస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సమైక్యతా దినోత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, సంఘం లక్ష్మీభాయి పాఠశాల, బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారికి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్‌లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

‘పాలమూరు’ జలాలతో ప్రత్యేక అభిషేకాలు

అనంతగిరి: సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో సాగుభూములను సస్యశ్యామలం చేశారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో పాలమూరు రంగారెడ్డి జలాల(కృష్ణా)తో స్వామివారి కి జలాభిషేకం చేశారు. అనంతరం ఆ జలాలను ఆలయంలోని పుష్కరణిలో కలిపారు. ఈ సందర్భంగా ఆలయం కమి టీ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు.

కల నెరవేరనుంది..

పరిగి: ‘పాలమురు–రంగారెడ్డి’ ప్రారంభోత్సవానికి వెళ్లిన ప్రజలు కృష్ణా జలా లను తీసుకువచ్చారు. ఆ జలాలతో ఆదివారం స్థానిక వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే అభిషేకం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కొడంగల్ రూరల్: ఆస్పత్రి ఎదుట ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం కొడంగల్ పట్టణంలో చోటుచేసుకొంది. హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపిన వివరాలు.. కొడంగల్ పట్టణానికి చెందిన నసీర్ (50) ఆదివారం పట్టణంలోని ఓ ఆస్పత్రి ఎదుట రోడ్డు దాటుతున్న క్రమంలో బొంరాస్‌పేట మండలం చిల్‌ముల్ మైలారం గ్రామానికి చెందిన శివకుమార్, వినయ్ బైక్‌పై అతివేగంగా వెళ్తూ నసీర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నసీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో విద్యార్థి మృతి


మహేందర్ (ఫైల్)

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి పాముకాటుతో చనిపోయాడు. బాధితుల తెలిపిన వివరాలు.. దౌల్తాబాద్‌కు చెందిన మాసని వెంకటమ్మ, మదనప్ప.. కుమారుడు మహేందర్ (11) స్థానికంగా 6వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో యధావిధిగా భోజనం చేసి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున తనను పాముకాటు వేసినట్లు తల్లిదండ్రులకు చెప్పాడు. తల్లిదండ్రులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహేందర్ మృతిచెందాడు.


జాతీయ పతాకంతో అభిమాని సందడి


అభివాదం చేస్తున్న కాంగ్రెస్ ప్రముఖులు

సమర'భేరి'

తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- ఆశించిన దానికంటే అధిక సంఖ్యలో హాజరైన జనం
- ఓఆర్ఆర్ సహా సర్వీసు రోడ్లపై ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు
- కేడర్‌లో నూతనోత్తేజం నింపిన ముఖ్యనేతల ప్రసంగాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తుక్కుగూడ వేదికగా ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి బహిరంగ సభ విజయవంతమైంది. సభాస్థలితో పాటు ఓఆర్ఆర్, సర్వీసు రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. రోడ్లపై ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం ఆరు గంటల ఐదు నిమిషాలకు సీడబ్ల్యూసీ సభ్యులతో కూడిన బృందం సభాస్థలికి చేరుకుంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే చేరుకున్నారు. ఈ సమయంలో వేదికపై ఆసీనులైన పార్టీ ముఖ్యులతో పాటు వివిధ గ్యాలరీల్లో కూర్చొన్న కార్యకర్తలు, నాయకులు సీట్లో నుంచి పైకి లేచి నిటారుగా నిలబడి 'జై సోనియా' అంటూ అభివాదం చేశారు. నిజానికి సభకు ప్రియాంక గాంధీ కూడా హాజరవుతారని అంతా ఆశించారు. ఆమె గైర్హాజరవడంతో అభిమానులు కొంత నిరుత్సాహానికి గురయ్యారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకాన్ని సోనియాగాంధీ ప్రకటించగా, రైతు భరోసా పథకాన్ని జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. అభయ హస్తం, చేయూత వంటి పథకాలను రాహుల్ గాంధీ ప్రకటించారు. ఒక్కోనేత ఒక్కో పథకాన్ని ప్రకటించడం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. సభా వేదికపై సోనియా 20 నిమిషాలే ఉన్నారు. ఐదు నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించారు. ఆమె వెళ్లిపోయిన తర్వాత మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి, తెలంగాణకు ఏం చేసిందో వివరించారు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే వర్గాలకు.. ఏంఏం చేయబోతోందో స్పష్టం చేశారు. చివరగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ముఖ్య నేతల ప్రసంగాలు కేడర్‌లో జోష్‌ను నింపాయి.

జన సమీకరణలో పోటీపడిన నేతలు

జన సమీకరణ విషయంలో నేతలు పోటీపడ్డారు. సభ నిర్వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దేప భాస్కర్‌రెడ్డి భారీగా జనాన్ని తరలించారు. చేవెళ్ల నేతలు సైతం ఈ విషయంలో పోటీ పడ్డారు. మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ జిల్లాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. సభకు హాజరైన వారిలో ఎక్కువగా యువతే కన్పించారు. వీరిలో విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు ఎక్కువగా ఉన్నారు. ముఖ్య నేతల దృష్టిలో పడేందుకు జిల్లా నేతలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీలు యత్నించారు. ఇందు కోసం తుక్కుగూడ–శ్రీశైలం జాతీయ రహదారి నుంచి సభాస్థలికి చేరుకునే మార్గంలో భారీ స్వాగత ద్వారాలు, ఫెక్సీలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సభకు భారీగా జనం తరలిరావడం, వెనుక ఉన్న బారీకేడ్లలో కుర్చీలు ఖాళీ లేక మీడియా గ్యాలరీలోకి చొచ్చుకు రావడం కొంత గందరగోళానికి దారితీసింది. వీరిని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారు. దీంతో మీడియా ప్రతినిధులు సైతం ఇబ్బంది పడాల్సి వచ్చింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

'ప్రతి ఇంటిలోనా సోనియా బొమ్మ ఉండాలి.. అదే ఇంటిపై కాంగ్రెస్ జెండా ఎగరాలి' అంటూ ప్రముఖ గాయకుడు నైనాల రమేష్ కళాకారుల బృందం ప్రదర్శించిన కళారూపాలు సభికులను విశేషంగా అలరించాయి. ఆగదు..ఆగదు.. ఈ ఆకలిపోరు ఆగదు.., మూడు రంగుల జెండాపెట్టి..సింగమోలే కదిలినాడు మన రాహుల్‌గాంధీ.. నిగ్గదీసి అడిగే మొనగాడు పాటకు సభికులంతా ఒక్కసారిగా కుర్చీల్లోనుంచి పైకి లేచి డ్యాన్స్ చేశారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే సీతక్క, పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంత రావు, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఖర్గే ప్రసంగాన్ని భట్టి తెలుగులోకి అనువదించగా, సోనియా, రాహుల్ గాంధీ ప్రసంగాలను ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనువదించారు. సభకు హాజరైన సామాన్య కార్యకర్తలు సైతం కళాకారులతో కలిసి నృత్యం చేయడం వారిలోమరింత జోష్ నింపినట్లైంది.

ఆ నాలుగు గంటలు ట్రా'ఫికర్'

తుక్కుగూడకు వచ్చి వెళ్లే ప్రధాన మార్గాలు సహా ఓఆర్ఆర్‌పై కూడా భారీగా ట్రాఫిక్ జాం అయింది. సభకు వచ్చిన కార్యకర్తలు, నాయకుల వాహనాలతో పాటు సాధారణ ప్రయాణికుల వాహనాలు కూడా ఈ ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పది గంటల వరకు ఇదే పరిస్థితి. ఇటు ఆదిబట్ల మొదలు.. అటు శంషాబాద్ వరకు.. పహడీషరీఫ్ మొదలు.. మహేశ్వరం కమాన్ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వచ్చిన వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయకపోవడం, వచ్చిపోయే వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లించకపోవడంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు ట్రాఫిక్‌లోనే గడపాల్సి వచ్చింది.


మల్లికార్జున ఖర్గేతో కరచాలనం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


వేదికపై ఆసీనులైన పార్టీ జిల్లా నేతలు



కళాకారుల ఆటాపాట

పెరియార్ ఆశయ సాధనకు కృషి

కేవీఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ వెంకటయ్య

తాండూరు టౌన్: దళిత, బహుజనులకు సమన్యాయం దక్కాలని పోరాటం చేసిన పెరియార్ జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కుల అసమానతా నిర్మూలనా పోరాట సమితి(కేఏఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేవుడు, మతం అనే భావాలను తిరస్కరించి, హేతువాద, నాస్తిక భావాలను ప్రచారం చేసిన మహనీయుడు పెరియార్ అన్నారు. వైకోం సత్యాగ్రహం చేపట్టి అంటరానివారికి రోడ్డుమీద నడిచే హక్కు, దేవాలయాల ప్రవేశాలను సాధించిన ధీశాలి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని.. సెప్టెంబర్ 17వ తేదీన కుల అసమానతా నిర్మూలన పోరాట దినంగా పాటిద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా కన్వీనర్ వెంకటయ్య, కోకన్వీనర్ కిష్టప్ప, రాజరత్నం, చిన్నబందెప్ప, కృష్ణ, బందెప్ప, అంబోజీ, మల్లప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడా కర్ణాటక ఫలితాలే వస్తాయి


ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రామ్మోమన్‌రెడ్డి తదితరులు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతం అవుతాయని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ నిర్వహించ తలపెట్టిన సభకు టీఆర్ఆర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన డిక్లరేషన్లతో సీఎం కేసీఆర్‌కు ఏం చేయాలో తోచక 40శాతం కూడా పనులు పూర్తి కాని ప్రారంభించారని విమర్శించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు కద్మూర్ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఖండాలు దాటిన 'చీమల్‌దరి' కీర్తి

సర్పంచ్ నానన్‌పల్లి నర్సింహారెడ్డి



మోమిన్‌పేట: ప్రపంచ స్థాయిలో నిర్వహించనున్న 'మొబైల్ కాంగ్రెస్' ఎగ్జిబిషన్‌లో తమ గ్రామ అభివృద్ధికి సంబంధించిన స్టాల్ ఏర్పాటు చేయనుండటం గర్వకారణంగా ఉందని చీమల్‌దరి సర్పంచ్ నానన్‌పల్లి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న ఆల్ ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఆసియాలో అతిపెద్ద డిజిటల్ టెక్నాలజీ ఫోరమ్) ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక స్టాల్ ఏర్పాటుకు ఆహ్వానం అందిందని స్పష్టంచేశారు. సుపరిపాలన, అభివృద్ధి, సాంకేతిక పురోగతి అంశాల్లో గ్రామానికి సంబంధించిన మ్యాప్‌లు, ఫొటోలు పంపాలని కోరుతూ బీఎస్ఎన్ఎల్ ఢిల్లీ జీఎం వివేక్‌దువా లేఖ రాశారని తెలిపారు. ఆన్‌లైన్ సేవలపై బీఎస్ఎన్ఎల్‌తో నేరుగా ఒప్పందం కుదుర్చుకున్న దేశంలోని తొలి జీపీగా చీమల్‌దరికి గుర్తింపు దక్కిందన్నారు. పంచాయతీ పరిధిలో ఉచిత వైఫై, ఎఫ్‌టీటీహెచ్, 4 జీ టెక్నాలజీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. సుపరిపాలన (బెస్ట్ గవర్నెన్స్) విభాగంలో కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నామని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పల్లె ప్రగతి స్ఫూర్తితో గ్రామాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరిస్తున్న స్థానిక ప్రజలు, ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

ఎంతపని చేశావ్ దేవుడా..

- విద్యుదాఘాతంతో ఒక్కగానొక్క కొడుకు మృతి
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- బ్రాహ్మణపల్లిలో తీవ్ర విషాదం


రాము (ఫైల్)

దోమ: ఏడుగురు కూతుళ్ల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క కుమారుడిని విద్యుత్ ప్రమాదం పొట్టన పెట్టుకున్న విషాదకర సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన సేనావత్ చందర్, జెమినీబాయి దంపతులకు ఏడుగురు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. కూతుళ్ల వివాహాలను ఘనంగా చేసిన ఆయన.. అందరిలో చిన్నవాడైన కొడుకు రాము(22) పెళ్లి జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇందులో భాగంగా బ్రాహ్మణపల్లిలో కుమారుడి కోసం నూతన గృహాన్ని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో రాము ఇంటిపై ఉన్న స్టీల్‌రాడ్‌ను కిందికి తీసుకు వస్తుండగా పైనున్న హైటెన్షన్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. క్షణాల్లో ప్రాణాలు విడిచి విగతజీవిగా పడిపోయాడు. చిన్ననాటి నుంచి అల్లారు ముద్దుగా చూసుకుంటున్న తమ కుమారుడి మరణాన్ని తట్టుకోలేని చందర్ దంపతులు ఎంత పని చేశావ్ దేవుడా.. అంటూ కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం రాము మృతదేహాన్ని పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

రేపు కలెక్టరేట్‌కు సినీహీరో బెల్లంకొండ రాక

వికారాబాద్ అర్బన్: ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా స్వీప్ ఐకాన్ సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కలెక్టరేట్‌కు మంగళవారం వస్తున్నట్లు కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించు ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు జిల్లాలోని కళాశాలల విద్యార్థులకు ఓటరు నమోదుపై, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తారు. జిల్లా అధికారులు, యువతీయువకులు పెద్దఎత్తున హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

1న పండుగల సాయన్న విగ్రహావిష్కరణ

పరిగి: బహుజనుల అభ్యున్నతికి పండుగల సాయన్న ఎంతో కృషి చేశారని మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్, ముదిరాజ్ మహాసభ నియోజక వర్గ అధ్యక్షుడు రాంచంద్రయ్య అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 1న పండుగల సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు బాలముకుందం, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాణిక్యం, కేశవులు, కృష్ణ, బాబు, శ్రీశైలం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణనాథులనే పూజిద్దాం: డీడీఎంహెచ్‌ఓ


మట్టి గణనాథులను అందజేస్తున్న రవీంద్రయాదవ్

కొడంగల్ రూరల్: పట్టణంలోని అభయాంజనేయ స్వామివారి దేవాలయ ఆవరణలో ఆదివారం మట్టి గణనాథులను పంపిణీ చేశారు. అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ హాజరై.. గణనాథులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ రంగులు అద్దిన గణనాథులను నిమజ్జనం చేయడం వలన కాలుష్యం పెరిగి పర్యావరణానికి హానికలుగుతుందన్నారు. మట్టి గణనాథులనే పూజించాలన్నారు. మట్టి గణనాథులు కావాల్సినవారు కమిటీ సభ్యులను సంప్రదించాలని తెలిపారు. కమిటీ సభ్యులు విక్రమ్, రాకేష్, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.